కలెక్టర్‌కు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 4: కలెక్టర్ వల్లూరు క్రాంతిని శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ నియోజవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

నారాయణఖేడ్, జనవరి 4: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలండర్‌ను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు జట్ల భాస్కర్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో కలెక్టర్ సహా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లు సంఘం క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం తరపున కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ అధికారి చింతా బలరాం, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గొంటాల వెంకటేశం, ఇతర బాధ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్లు...

టీఎస్ యూటీఎఫ్, టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘాల నూతన సంవత్సర క్యాలండర్లను శనివారం నారాయణఖేడ్‌లో స్థానిక ఎంఈవో విశ్వనాథ్, తహసీల్దార్ భాస్కర్, ఎస్ఐ శ్రీశైలం చేతుల మీదుగా ఆవిష్కరించారు. నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

దివ్యాంగుల ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 4: దివ్యాంగుల ప్రజావాణికి 14 ఫిర్యాదులు అందాయి. జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో కలెక్టర్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ తనకు అంధత్వం వచ్చిందని బాధపడకుండా, అంధులు చదువుకోడానికి వీలుగా ప్రత్యేక లిపిని కనుగొన్నారని చెప్పారు. ఈ లిపి 6 బిందువుల ఆధారంగా రూపొందించబడిందని, అక్షరాలు, సంఖ్యలు, సంగీతం వంటి వివిధ అంశాలను సులభంగా ప్రదర్శించగలుగుతుందన్నారు. లూయిస్ బ్రెయిలీ లిపితో ఎంతోమంది అంధులు ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తు చేశారు. సివిల్స్‌లో ర్యాంకుల సాధించి కలెక్టర్లు అయ్యారని గుర్తు చేశారు. అనంతరం బ్లైండ్ స్టిక్కర్లను పంపిణీ చేశారు. బ్రెయిలీ లిపీ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

దివ్యాంగుల ప్రజావాణికి 14 దరఖాస్తులు

ప్రతినెలా మొదటి శనివారం దివ్యాంగుల ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణికి 14 ఫిర్యాదులు అందాయి. ఆయా అర్జీలను స్వీకరించిన కలెక్టర్ వాటిని సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతినెలా మొదటి శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా పెన్షన్లు, ఉపకరణాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితా కుమారి, డీఈవో వెంకటేశ్వర్లు, ప్రభుత్వ దవాసూపరింటెండెంట్ అనిల్ పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్

జహీరాబాద్, జనవరి 4: జహీరాబాద్‌లోని బాగారెడ్డి స్టేడియంలో భిజయ్ యాపై అంతర్రాష్ట్ర గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. హెచ్‌సీఏ మార్గదర్శకాలతో ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగే క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 16 క్రికెట్ జట్లు రానున్నాయన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రికెట్ జట్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విజేత జట్టుకు రూ. 6,11,111, రన్నర్‌కు రూ.3,55,555 నగదుతోపాటు ట్రోఫీలుసహా ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

విలేకరుల సమావేశంలో గ్రామస్తులతో కలిసి మాట్లాడుతున్న నల్తూర్ మాజీ సర్పంచ్ జనార్దన్

'క్రషర్'తో గ్రామానికి ముప్పు

- అధికారుల నివేదిక ఆధారంగా అనుమతులు రద్దు చేయాలి
- కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసిన నల్తూర్ గ్రామస్తులు

బొల్లారం, జనవరి 4: గ్రామంలో క్రషర్ ఏర్పాటు చేయడం వల్ల జరిగే అనర్థాలను జిల్లా ఉన్నతాధికారులు బాధ్యత వహించాలని, ఇప్పటికైనా గుర్తించి క్రషర్ ఏర్పాటు అనుమతులను రద్దు చేయాలని నల్తూరు గ్రామస్తులు కలెక్టర్ వల్లూరు క్రాంతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం జిన్నారం మండలం నల్తూరు గ్రామంలో గ్రామస్తులతో కలిసి మాజీ సర్పంచ్ జనార్దన్, నాయకులు రాజేశ్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే గ్రామంలో స్థానిక ప్రజల ఫిర్యాదుల మేరకు జిల్లా మైనింగ్ ఏడీ, స్థానిక తాసీల్దార్ ప్రత్యేకంగా పర్యటించారని పేర్కొన్నారు. స్థానిక పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందజేశారని చెప్పారు. క్రషర్ ఏర్పాటు వల్ల గ్రామంలో ప్రతికూల పరిస్థితులు నెలకొంటాయని, తద్వారా అటవీ ప్రాంతం దెబ్బతినడం, ఇల్లు బీటలు వారడం, పశు సంపద వ్యవసాయ జీవనాధార పరిస్థితులు పూర్తిగా చిన్నాభిన్నం అయ్యే అవకాశం ఉందని జిల్లా ఉన్నతాధికారులకు స్పష్టంగా తెలపడంపై అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే మాదారం, మంత్రికుంటలో ప్రజలు పడుతున్న బాధలు అందరికీ తెలిసిందేనని వారు పేర్కొన్నారు. గ్రామస్తుల గోడును మన్నించి అటు పర్యావరణానికి, ఇటు ప్రజా జీవనానికి ఎలాంటి విఘాతం కలగకుండా కలెక్టర్ క్రషర్ అనుమతులను రద్దు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులతో కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు భీమ్రావు, ఆంజనేయులు, యువకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన

కంది, జనవరి 4: విద్యార్థులకు అపార్ ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించాలని కంది మండల విద్యాధికారి జోగప్ప ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శనివారం కంది జడ్పీహెచ్ఎస్‌లో అపార్ ఐడీ రిజిస్ట్రీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్రం ఆధార్ కార్డు తరహా విద్యార్థి విద్యా అవసరాల కోసం గుర్తింపు కార్డుగా అపార్ ఐడీని ప్రవేశపెట్టిందని, దీనిపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి అపార్ కార్డుల నమోదుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఆధార్ గుర్తింపు కార్డులో ఉన్నట్లే పాఠశాల రికార్డుల్లో విద్యార్థి పేరు, ఇంటి పేరు, పుట్టిన తేదీ ఉండాలని, ఏమైన తప్పులుంటే సరి చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్య, వెంకటలక్ష్మి, రాఘవులు, శ్రీనివాస్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కంది జడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంఈవో జోగప్ప

సిరిపురలో ఉచిత వైద్యశిబిరం

ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

హత్నూర, జనవరి 4: హత్నూర మండలం సిరిపురలో శనివారం ఎమ్మెన్నార్ మెడికల్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పదిమందికి శస్త్రచికిత్సలు అవసరం ఉండటంతో దవాఖానకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాజీస ర్పంచ్ నరేందర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బొల్లారంలో క్రీడా ప్రాంగణం

ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు

బొల్లారం జనవరి 4: కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని స్థానిక సంఘసేవకుడు ఆనంద్ కృష్ణా రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని క్రీడా ప్రాంగణాల కోసం కేటాయించిన స్థలాలు అసాంఘిక కార్యకలాపాలతోపాటు ఆక్రమణకు గురవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. సామాజిక భవనాలను నిర్మిస్తే నిరుపేదల శుభకార్యాలకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అలాంటి భవనాల ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుందని, అభివృద్ధికి కూడా దోహదపడుతుందని, సంఘసేవకుడు ఆనంద్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆ వైపుగా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఎస్పీదంపతులు

ఝరాసంగం, జనవరి 4: కేతకీ సంగమేశ్వర ఆలయాన్ని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ దంపతులు శనివారం సందర్శించారు. ఆలయ మర్యాదలు, పూర్ణకుంభంతో పూజారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ఎస్పీ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆనంతరం పూజారులు ఘనంగా సత్కరించారు. ఆయన వెంట జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, రూరల్ సీఐ జక్కుల హనుమంతు, ఎస్ఐ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కేతకీ సంగమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్ దంపతులు

క్రీడోత్సవాలకు కలెక్టర్, ఎస్పీలకు ఆహ్వానం

గుమ్మడిదల, జనవరి 4: గుమ్మడిదలలో ఈనెల 10 నుంచి జరిగే ఓపెన్ టు ఆల్ క్రీడోత్సవాలకు హాజరుకావాలని కలెక్టర్, ఎస్పీలను బీఆర్ఎస్ నాయకుడు ఆహ్వానించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతిని, ఎస్పీ రూపేశ్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిన్నపాపని కుమార్‌గౌడ్ కలిశారు. ఈనెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే క్రీడల ప్రారంభోత్సవాలకు, స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణకు హాజరుకావాలని వారిని కోరారు. దీనికి జిల్లా అధికారులు సానుకూలంగా స్పందించినట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో క్రీడాకారులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. వీరితో పాటు బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

కలెక్టర్ వల్లూరు క్రాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎస్పీ రూపేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తగ్గిన ధరతో విలవిలలాడుతున్న రైతులు

జహీరాబాద్, జనవరి 4: జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో వారంతపు సంతలు, మార్కెట్‌లో టమాటా ధరలు తగ్గడంతో రైతులు విలవిలలాడుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి టమాటాను సాగు చేశారు. కానీ మార్కెట్‌తోపాటు వారంతపు సంతల్లో ఒక్కసారి ధరలు పడిపోవడంతో పెట్టుబడులు కూడా రాక నష్టాల పాలయ్యామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం రూ.25 నుంచి 30 పలికిన టమాట ధర శనివారం న్యాల్‌కల్ మండలం హద్నూర్ గ్రామంలోని వారంతపు సంతలో కిలో రూ.10 పలికింది. కొందరు రైతులు హోల్‌సేల్‌గా 60 కిలోల టమాట బాక్సును రూ.100కు అమ్ముకుంటున్నారు. అంటే ఒక్కో కిలోకు రూ.2 కూడా దక్కడం లైదు. కనీసం మార్కెట్‌కు తీసుకెళ్తే గిట్టుబాటు కావడం లేదంటున్నారు. కానీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

గుమ్మడిదల, జనవరి 4: పిచ్చికుక్కల దాడిలో 20 మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని వీరారెడ్డిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన మహిపాల్ మేకలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఎవరు లేని సమయంలో పిచ్చికుక్కలు మేకల దొడ్డిలోకి వెళ్లి 20 మేకలను కరవడంతో అవి మృత్యువాత పడ్డాయి. శనివారం ఉదయం మేకల దొడ్డికి వెళ్లిన కాపరికి మూగజీవాలు జీవచ్ఛవంలా కనిపించడంతో బోరున విలపించారు. ఈ విషయాన్ని స్థానికులు మండల పశుసంవర్ధక శాఖ వైద్యురాలు అరుణకు తెలియజేయగా ఆమె ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మేకలను పోస్ట్ మార్టం చేశారు. జిల్లా అధికారులకు నివేదిస్తామని తెలిపారు. మహిపాల్ జీవనాధారం మేకలే కావడంతో ఉపాధి కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సాయమందించాలని వేడుకున్నారు.

నకిలీ మందుల తయారీ నిజం కాదు

బొల్లారం, జనవరి 4: బొల్లారం పారిశ్రామికవాడలోని ఆక్రన్ ఫార్ములేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో నకిలీ మందుల తయారీ వార్తలో నిజంలేదని పరిశ్రమ మేనేజర్ శేషుబాబు తెలిపారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించి కేవలం అనుమతి లేని మందులను మాత్రమే సీజ్ చేశారని తెలిపారు. ఇటీవల ఆక్రన్ పరిశ్రమలో డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించిన విషయం పాఠకులకు తెలిసిందే.

మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సభ్యులు

ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా టింకు మాదిగ

జహీరాబాద్, జనవరి 4: మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఎర్పుల టింకు మాదిగను ఎన్నుకున్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా టింకుమాదిగ, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్‌కుమార్, నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా సూర్యకాంత్, కార్యదర్శులుగా లాజర్, సురేశ్, రాజేశ్, సభ్యులుగా గుండు, మహేశ్, కృపరాజ్, సుధాకర్, ప్రభాకర్, నగేశ్, చిన్న, అనంద్, బాబు, విల్సన్, స్టిఫెన్ తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు అబ్రహం మాదిగా, ఇన్‌చార్జులు ఉల్లాస్ మాదిగ, జైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషిచేయాలి

అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

తెల్లాపూర్ సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

రామచంద్రాపురం, జనవరి 4: ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషిచేయాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కొల్లూర్-1,2 డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయాలకు సంబంధించిన సొసైటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కొల్లూర్ డబుల్ బెడ్‌రూం సముదాయాల్లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. డబుల్ బెడ్‌రూం యజమానులందరూ కుటుంబ సభ్యులుగా కలిసిమెలిసి ఉండి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. బేషజాలకు పోకుండా సానుకూల వాతావరణంలో జీవనం కొనసాగించాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు. అతి త్వరలో జీహెచ్ఎంసీ, మున్సిపల్ శాఖల నుంచి అన్ని వసతులను కల్పిస్తామని చెప్పారు. సొసైటీలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోగానే దుకాణాలను అలాట్ చేస్తామన్నారు. కొల్లూర్ నుంచి బస్సు సౌకర్యం, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం పక్కనే ప్రారంభానికి సిద్ధమవుతున్న ఫంక్షన్ హాల్, బీటీ రోడ్డు, స్త్రీశక్తి మహిళా క్యాంటీన్ పనులను ఆయన పరిశీలించారు. సమావేశంలో కమిషనర్ సంగారెడ్డి, డీఈఈ సత్యనారాయణ, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, ఏఈఈ మౌనిక, సీడీపీవో జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి

రాయికోడ్, జనవరి 4: రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వరం వైస్ చైర్మన్ తుకారం కురుమ అన్నారు. శనివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఆయన మాట్లాడుతూ ఎలంటి షరుతులు లేకుండా ప్రభుత్వం రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఏడాది గడిచినా రైతులకు రైతుభరోసా ఇవ్వకుండా రకరకాలుగా మభ్యపెట్టడం సరైంది కాదన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు మూడు విడతలుగా రైతుభరోసా ఇస్తామని తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే షరుతుల విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బాలికల పాఠశాలలో మాట్లాడుతున్న జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

జహీరాబాద్, జనవరి 4: విద్యార్థులందరికీ తప్పనిసరిగా చట్టాలపై అవగాహన ఉండాలని జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జహీరాబాద్ మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రతి విద్యార్థికీ చదువుతోపాటు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జూవైనైల్, పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, బాల్య వివాహాలు, బాలకార్మిక నిర్మూలన చట్టం, మోటారు వాహనాల చట్టాలపై న్యాయవాదులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపాల్, న్యాయవాదులు రాఘవేందర్ నాయక్, విజయ్‌కుమార్, లీగల్ సర్వీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సదాశివపేట, జనవరి 4: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నా కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నదని విమర్శించారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జనవరి 6న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రవి, నగేశ్, సుక్కల బాలరాజ్, శ్రీనివాస్, రాజు, నందు, మొగులయ్య, రుక్కమ్మ, లక్ష్మి, సంతోష, ప్రమీల, అమృతమ్మ, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలి

జోనల్ కమిషనర్‌ను కలిసిన పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, జనవరి 4: పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం నిధులు కేటాయించాలని శనివారం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని, డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్‌ను కలిశారు. రూ.50లక్షల విలువైన సీసీ రోడ్డు పనుల నిర్మాణ ప్రతిపాదన పెండింగ్‌లో ఉందని, వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మైత్రి క్రీడా మైదానం, కృషి డిఫెన్స్ కాలనీలో రూ.42లక్షలతో ఓపెన్ జిమ్ నిర్మించాలన్నారు. రూ.6కోట్లతో నిర్మించిన గాంధీ థీమ్ పార్క్, ప్రీడం పార్క్‌ను ఓపెన్ చేయాలని కోరారు. పలు రకాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, వాటికి నిధులు కావాలని కార్పొరేటర్ కోరారు. స్పందించిన జోనల్ కమిషనర్, డిప్యూటీ డైరెక్టర్లు రూ.50లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సానుకూలత వ్యక్తం చేశారు. మైత్రి మైదానం, కృషి డిఫెన్స్‌కాలనీల్లో ఓపన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. గాంధీ థీమ్ పార్క్, ప్రీడం పార్క్‌లను మెయింటైన్ చేసేందుకు సిబ్బంది కొరత ఉందని, వారం రోజుల్లో సిబ్బందిని ఏర్పాటు చేసి వాటిని ప్రజల కోసం తెరుస్తామని తెలిపారు. వారికి కార్పొరేటర్ ధన్యవాదాలు తెలిపారు.

జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్

10న ఉత్తర ద్వార దర్శనం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 4: ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు వైకుంఠపురం ఆలయ ప్రధాన అర్చకుడు వరదాచార్యులు పేర్కొన్నారు. శనివారం పట్టణ శివారులోని శ్రీవైకుంఠపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని వేద పాఠశాల విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరదాచార్యులు మాట్లాడూతూ.. ఈనెల 6న శ్రీవారి రథయాత్ర పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి కలెక్టరేట్, ఐబీ, కొత్త, పాత బస్టాండ్ల మీదుగా శ్రీవైకుంఠపురం వరకు కొనసాగుతుందన్నారు. ఈనెల 10న ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని, దాదాపు లక్షన్నర మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్నదని వివరించారు. ఈనెల 11న వైకుంఠ ద్వాదశి, 12న 1008 క్షీరాన్న ప్రసాద నివృదనతో కూడారై, 13న గోదారంగనాథుల కల్యాణోత్సవం, 14న ఏకాంత సేవ (ఊంజల్ సేవ), 15న సర్వమంగళాదేవి ఆవిర్భావోత్సవము వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు ధనుర్మాస ఉత్సవాల్లో పాల్గొని తరించాలని ఆకాంక్షించారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

అమీన్‌పూర్ జనవరి 4: ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణల మూలంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్